

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**మంచుతో నిండిన** తెల్లటి పర్వతాల మీద ఆకాశాన్ని తాకేంత పొడుగు చెట్లున్నాయి. మాంజ్ ఖమాజా రాగంలో పాడుతున్న పక్షులు నిద్రపొమ్మంటున్నాయి. సునాయాసంగా వీచేగాలి మంచుని తాకినా, వెచ్చగా ఉంది. గడ్డిలో పడుకుని ఆకాశంలోని తారలని లెక్కపెడుతుంటే, సూర్యుడు లేకపోయినా వేడి పెరిగింది. అలా పెరిగీ పెరిగీ చెమటలు పడుతున్నాయి. విసురుకోడానికి చుట్టుపక్కల అందుబాటులో ఏమీలేదు. కదలాలంటే బద్దకం. ఇంతలో పిడుగుపడిన చప్పుడు. ఆ చప్పుడికి ఉలిక్కిపడి సోఫాలో పడుకున్న దాన్ని లేచాను.

అదంతా కలా? అని కొద్దిసేపు బాధపడ్డాను. అన్నయ్య కప్పిన రగ్గుని కాళ్ళతో నెట్టి కిందపడేసాను. కళ్ళుమూసుకుని ఎంత ప్రయత్నించినా కల మాత్రం జారిపోయింది. ఎంతసేపటికీ నిద్రపట్టకపోవడంతో బద్దకంగా లేచి లైట్ ఆన్ చేసేలోగా ఓసారి టీపాయికి, రెండుసార్లు గోడకి గుద్దుకున్నాను. దాంతో ఉన్న కాస్త నిద్రమత్తు కూడా వదిలింది. నెమ్మదిగా అన్నయ్య గది తలుపు మూసి, ఏం చెయ్యాలో తోచక నా పెట్టెలు తెరిచాను. అందులో అమ్మ సర్దిన బట్టలు, పచ్చళ్ళు, మొదలైనవి చూసి బాగా దిగులు కలిగింది. చార్జ్‌లో

ఉన్న వానేజ్ ఫోన్‌ని తీసుకుని, నంబర్‌ని ఎలా డయల్ చెయ్యాలో తెలియదు కనక అదృష్టాన్ని పరీక్షిద్దామని రీడియల్ నొక్కాను. ఫోన్ రింగ్ అవుతుండగా కట్ చేద్దామన్న ఆలోచన ప్రతి రింగుతో బలపడింది. అమ్మ 'హలో' అనడంతో గుండె వేగం తగ్గి ఓ చిరునవ్వు వికసించింది.

"బంగారం లేచేసావా?" అమ్మ అడగడంతో నా ప్రమేయం లేకుండానే వెక్కి వెక్కి ఏడ్చాను. అమ్మ ఓదార్చే కొద్దీ ఏడుపు పెరగడంతో ఫోన్ పెట్టేసి బాల్కనీలోకి వెళ్ళాను. ఎంతసేపు అక్కడ నిలబడి ఏడ్చానో తెలియదు కానీ లోపలికొచ్చి మళ్ళీ అమ్మ గొంతు ఫోన్‌లో విన్నాక ఏడుపు రాలేదు. అమ్మతో నా ప్రయాణ విషయాలు, కారులో నిద్రపోవడం, అన్నయ్య తీసుకెళ్ళిన ప్లేస్, అపార్ట్‌మెంట్‌ల గురించి చెప్తూ అన్నయ్యకోసం అమ్మమ్మ పెట్టిన ఆవకాయ, గోంగూర, టమాట పచ్చళ్ళు, పూతరేకులు, ఉలవచారు, కాజా బర్ఫీ, కరివేపాకు పొడిని కిచెన్‌లో సర్దాను. చుట్టాల విషయాలు, ఆకాయ్ పోకాయ్ కబుర్లతో మునిగిపోయి, వానేజ్ చార్జ్ అయిపోవచ్చిందనే సంగతిని గమనించలేదు. ఆ తరువాత ఫ్రిడ్జ్ మీద మేగ్నెట్లు, అన్నయ్య షాట్‌గ్లాస్‌లు చూస్తూ కాస్త కాలక్షేపం చేసాను. ఇంతలో ఆకలి మొదలైంది. ఫ్రిడ్జ్ అంతా ఖాళీ. డీ ఫ్రిడ్జ్‌లోవి ఎలా వండాలో తెలియదు. అన్నయ్య ఎప్పుడు లేస్తాడో తెలియదు. సరేలే అని మడత కాజాలు రెండు, చెక్కలు రెండు, కొన్ని చెక్కిడాలు తిని సన్‌రైజ్ చూడ్డానికి బాల్కనీలో నిలబడ్డాను. ఇంతలో అన్నయ్య తలుపు చప్పుడైంది. నిద్రమొహం, చెదిరిపోయిన జుట్టుతో కాక బట్టలు మార్చుకుని, తలదువ్వుకుని హైకింగ్‌కి తయారైపోయాడు.

"గుడ్‌మార్నింగ్" అంటూ షూస్ వేసుకుని "ఇంకా రెడీ అవ్వలేదేంటి?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఇంకా సన్‌రైజ్ కూడా అవ్వలేదు కదా?"

"హైకింగ్‌కి మధ్యాహ్నం ఎండలో వెళ్ళరు, పొద్దున్నే వెళ్తారు" ఎగతాళిగా అన్నాడు.

"డ్రస్ ఛేంజ్ చేసుకుని వస్తా" లోపలికి వెళ్ళాను.

పది నిమిషాల తరువాత నేను బయటికి వచ్చి షూస్ వేసుకుంటుండగా, "మడతకాజాలు ఎందుకు తెరిచావ్? ఆ డబ్బాని అలానే ఇండియానాకి తీసుకెళ్ళడం ఈజీ కదా?"

"ఆకలేసిందన్నయ్య. ఫ్రిడ్జ్‌లోవి ఎలా వండాలో తెలీదు. అందుకే తెరిచాను"

పెద్దగా నవ్వి "ఆకలేస్తుందని పొద్దున్నే పళ్ళు తోముకోకుండా మడతకాజాలు తిన్నావా?" అడిగాడు.

చిన్నబోయి నేను ఏమీ మాట్లాడలేదు.

కారెక్కేముందు "అటువైపు" అని అన్నయ్య గుర్తుచేసాడు.

"అమ్మతో మాట్లాడతావా?" కారు స్టార్ట్ చేస్తూ అడిగాడు.

"పొద్దున వానేజ్‌లో మాట్లాడాను" బదులిచ్చాను.

"ఎప్పుడు లేచావు?"

"టైం చూడ్లేదు. కానీ చాలాసేపే అయ్యింది."

"ఇవాళ మధ్యాహ్నం పడుకోకు. ఎంత నిద్రొచ్చినా ఆపుకో. లేకపోతే కష్టం. నీ డేస్ వేస్ట్ అవుతాయి"

"అలాగే"

'జాగేహే దేరు తను హమే' అంటూ రెహ్మాన్ పాట వింటు అన్నయ్య కారు నడపడం నాకు నవ్వొచ్చింది.

"ఏమైందే? ఎందుకు నవ్వుతున్నావు?" అన్నయ్య ఎంత అడిగినా నేను బదులివ్వలేదు.

బయట ఇంకా చీకటిగానే ఉంది. అలా ఆ పొగమంచులో కొద్ది దూరం డ్రైవ్ చేసాక "వచ్చేసాము" అన్నాడు అన్నయ్య.

"చల్లగా ఉన్నట్టు ఉందిగా. నేను స్వెటర్ మర్చిపోయాను" జాలిగా అన్నాను.

"టెంపరేచర్ 68 ఉంది. స్వెటర్ అక్కర్లేదు" అంటూ కారు దిగాడు. తన వెంట నేనూ దిగాను. కానీ కాస్త చలి ఉంది. ఎక్కువసేపుంటే భరించలేనని "చల్లగానే ఉందన్నయ్యా" తిడతాడేమో అని భయపడుతూ చెప్పాను.

"కాస్త దూరం నడిస్తే ఉక్కపోస్తుంది. అక్కడ ఒక పోల్ అనిపిస్తుంది చూడు?" వేలితో పాయింట్ చేస్తూ అడిగాడు.

తలూపాను.

"అక్కడికి వెళ్ళాక కూడా చలేస్తే వెళ్ళిపోదాం" అంత సహనంగా అనడం విని ఆశ్చర్యపోయాను. అన్నయ్య చెప్పినట్టే నడుస్తూండగా ఉక్కపోత మొదలైంది. అది కనిపెట్టిన అన్నయ్య

"కారులో ఒక స్వెటర్ ఉండాలే. తీసుకు రానేంటి? చిట్టి చెల్లికి చలి పడదట కదా" అంటూ హేళన చేశాడు. ఎటు చూసినా కొంచెం ఫాగ్, కొంచెం చీకటి ఉండడంతో చుట్టూ ఉన్న అందం కనబడలేదు.

"ఇక్కడ కాస్త తడిగా ఉంది, చూస్కో.. ఇక్కడ మెట్లున్నాయి జాగ్రత్త" అంటున్న అన్నయ్య మాటలమీద దృష్టి ఉంచి నడవడంతో చుట్టూ ఏముందో గమనించలేదు. ఎత్తు ఎక్కడం మొదలుపెట్టాక కొంతసేపటికి అలసట పెరిగింది.

"ఒక బ్రేక్ తీసుకుందాం" అన్నయ్యతో చెప్పాను.

"అప్పుడేనా?" నేను జోక్ చేస్తున్నా అనుకున్నాడనుకుంటా.

ఆగకుండా నడిచాడు. కొన్ని అడుగుల తరువాత "పోనీ ఇప్పుడు?" అడిగాను.

"బ్రేక్ తీసుకుంటే ఇంక ప్రతి పదినిమిషాలకి ఆగాలనిపిస్తుంది. కొంచెం దూరం నడిస్తే అదే అలవాటైపోతుంది" మొదటిగా సమాధానమిచ్చాడు.

ఓ ఇరవై ముప్పై అడుగుల తరువాత "నావల్ల కాదింక" అని ఆగిపోయాను.

పదినిమిషాలు కూడా అయ్యి ఉండవు "నడుద్దామా?" నిదానంగా అడిగాడు.

జవాబివ్వకుండా తిట్టుకుంటూ లేచి నడవసాగాను. కొంతసేపు నిశ్శబ్దంగా నడిచిన తరువాత "ఒక్కసారి ఆగితే అలసట కలిగిన ప్రతిసారి ఆగచ్చని నీ బ్రైన్ ట్యూన్ అవుతుంది. ఫస్ట్ టైం కాబట్టి బాగా అలసిపోతావు. కానీ ఇంత తొందరగా రెస్ట్ కావలంటావనుకోలేదు. తిప్పి కొడితే 600 ఫీట్ నడిచుంటావంతే. అలసిపోయినప్పుడు టెన్ స్టెప్స్. ఓన్లీ టెన్ మోర్ స్టెప్స్ అనుకో. ఆ టెన్ స్టెప్స్‌ని ఫాస్ట్‌గా కాకుండా మెల్లిగా నడువు. ఆటోమేటిక్‌గా నువ్వే నడుస్తావు" వివరించాడు అన్నయ్య.

మిగతా దూరమంతా అన్నయ్య చిట్కా పనిచేసింది. మొత్తానికి తనంతట తానే ఆగాడు. నేలచూస్తూ, గట్టిగా ఊపిరి పీలుస్తూ, చమటలు తుడుచుకుంటున్న నాతో "ఆకాశం చూడు" అన్నాడు.

తల ఎత్తి చూసి ఓ క్షణం భయపడ్డాను. భూమిని ధ్వంసం చెయ్యడానికి రెడీగా ఉన్న నిప్పు బంతిలా ఉన్నాడు సూర్యుడు. పక్కనే ఉన్న బండరాయి మీద కూర్చోమన్నట్టుగా సైగ చేసాడు. ఆకాశం ఎరుపునుండి పింక్‌కి, పింక్ నుండి ఆరెంజ్‌కి, ఆరెంజ్ నుండి యెల్లోకి మారసాగింది.

"ఇందాక నేను చెప్పింది కేవలం హైకింగ్ వర్తించదు. నీ లైఫ్‌కి కూడా అప్లై అవుతుంది. ఎప్పుడూ బ్రేక్ తీసుకోకు. స్ట్రెస్ ఎక్కువైతే బేబీ స్టెప్స్ తీసుకో. అంతేకానీ మొత్తానికి ఏదీ మానేయకు" నాకేసి చూసాడు.

అన్నయ్య చెప్తున్నవన్నీ బుర్రలోకి ఎక్కించుకుంటూ తలుపాను.

"సరే. ఇంతటితో క్లాస్ సమాప్తం. అటుచూడు" అని వేలితో ఎడంవైపు చూసాడు.

అక్కడ కొన్ని జింకలు గడ్డి తింటున్నాయి. గడ్డంత పింక్, వైలెట్, యెల్లో పూలతో నిండిపోయింది. మేము కొండెక్కినా చుట్టూ అంతా పెద్ద మౌంటెన్స్ కనబడ్డాయి. గుంపులో ఎగిరే పక్షులు.. డిటెల్స్‌లోకి వెళ్ళి మిమ్మల్ని ఈసారి విసిగించను.

"ఎంతెత్తు ఎక్కామో అంతెత్తు దిగాలి. కాసేపటికి వేడి పెరుగుతుది. బయలుదేరదామా?" అన్నయ్య అడిగాడు.

తలూపి అన్నయ్య వెంట బయలుదేరాను. మిగతా నడకంతా కేవలం చుట్టుపక్కల ఉన్న వాటిగురించి, చిన్నప్పటి విషయాల గురించి మాట్లాడుతూ టైం తెలియకుండానే కారెక్కి ఇంటికి బయలుదేరాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story